
# ప్రేమ వెల్లువ

బాలాంత్రపు వెంకట రమణ




(క్రిందటి సంచిక తరువాయి)

నా ఉత్తరాలన్నింటికీ జవాబులు వ్రాసే నన్నాడు. అవి నాకెందుకు అందలేదు? ఒకసారిమాత్రం 'మమ్మీ, ఎనీ లెటర్ ఫర్ మి?" అని అడిగితే ఎప్పుడూ నాకేసి సూటిగా చూసి సమాధానం చెప్పే మమ్మీ మొహం వక్కకి తిప్పుకొని ఏమీ లేవన్నట్టు చెయ్యి తిప్పింది. ఆ సమయంలో ఆమె మొహం ఎర్రబడ్డం కూడా గమనించాను. ఏదో చికాగ్గా ఉందేమో అనుకున్నాను. కాని, ఇదన్న మాట సంగతి. మొదటిసారిగా మమ్మీ మీద కోపం వచ్చింది.

ఇంక అతణ్ణి కలుసుకోకుండా ఉండలేను. పిన్ని ఇంటికి వెళ్తున్నానని చెప్పి బయలుదేరాను. గంట సేపు కష్టపడి బాగా మేకప్ చేసుకున్నాను. మమ్మీ అంతా చూస్తోంది. ఏమీ అనలేదు. కాని, కోపంతో బుసబుసలాడుతోంది. అతను ఇంట్లో లేడు. కొంచెం సేపు పిన్నితో కబుర్లు చెప్పి తరువాత లకుమ ఇంటికి వెళ్ళి చాలా సేపు

కూర్చొని మళ్ళీ వెళ్ళి చూశాను. అతను ఇంకా రాలేదు. ఈ మధ్య కాలంలో ఆ లోగిలిలో చాలా మందితో, ముఖ్యంగా వాను వదినగారితో పరిచయం అయింది. ఆవిడ పాప నాలుగేళ్ళ వింధ్యని చేరదీసి ఎవరూ లేకుండా చూసి "మీ బాబాయ్ ఏడీ, పాపా?" అని అడిగాను మెల్లిగా.

"మా బాబాయ్ ఎప్పుడూ ఇంట్లో ఉండడు. అస్తమానూ ఫ్రెండ్స్‌తో వెళ్ళిపోతాడు. నన్ను సినిమాకే తీసుకెళతా నంటాడు, పార్కుకి తీసుకెళతా నంటాడు. అన్నీ అబద్ధాలే!" అని గట్టిగా అరిచింది. నేను బిక్కచచ్చిపోయి పారిపోయాను.

మర్నాడు ఆదివారం. ఆ రోజుని నా జన్మజన్మలకీ మరిచిపోలేను. ప్రొద్దున్న తొమ్మిది గంటల వేళ సోఫా కుర్చీలో కూర్చొని న్యూస్‌పేపర్ చదువుకుంటున్నాను. ఫోన్ మ్రోగింది. ఛెంగున లేచి నేను ఫోన్ తీసేలోపల ఆ ప్రక్కనే కూర్చుని ఏదో నోట్స్ తయారు చేసుకుంటున్న మమ్మీ ఫోనందుకుంది.

"శారద" అంది. అటునుంచి మాటలు నాకు వినిపిస్తున్నాయి.

"గుడ్ మార్నింగ్! మే ఐ స్పీక్ విత్ హేమ, ప్లీజ్?"

"హు ఈజ్ స్పీకింగ్?"

"వాను."

"దేర్ ఈజ్ నో 'హేమ' హియర్. ఓ! యూ మీన్ 'హైమ'" అంది కటువుగా. ఆమె గొంతులోని కాఠిన్యానికి నేను విస్తుపోయాను.

"సారీ...హైమ ప్లీజ్."

"యామ్ అఫ్రైడ్ షి హాజ్ గానౌట్."

"మమ్మీ!!" దెబ్బ తిన్న పక్షిలా గట్టిగా అరిచాను. మమ్మీ ఫోన్ పెట్టేలోగా నా అరుపు అతనికి వినిపించే ఉంటుంది. ఒంట్లోని రక్తం అంతా నా మొహంలోకి వచ్చేసింది. నా చేతులు కంపిస్తున్నయి.

"బేబి" అంది అమ్మ శాంతంగా, దృఢంగా.

"దిసిజ్ వెరీ అన్ ఫెయిర్, మమ్మీ!" నా కన్నీళ్ళు ఆగటం లేదు.

"ఏమిటర్రా హడావిడి?" అంటూ డాడీ హాల్లోకి వచ్చారు.

మమ్మీ చివాల్న ఆయనకేసి తిరిగింది. "ప్లీజ్! ఏమీ అడక్కండి! ఇది నాకూ, బేబికీ సంబంధించిన విషయం. నేను సాల్వ్ చేయలేకపోతే మీ సాయం కోరుతాను. కైండ్లీ డోంట్ ఇంటర్‌ఫియర్ నౌ!" డాడీ మమ్మీకేసి, నాకేసి విచిత్రంగా చూసి బయటికి వెళ్ళిపోయారు. మమ్మీ నా చేయి పట్టుకొని ఆవిడ గదిలోకి తీసుకెళ్ళింది. బొమ్మలా వెంట నడిచాను. నా మెదడు స్తంభించిపోయింది. మమ్మీ ఇంత క్రూరంగా ప్రవర్తిస్తుందని నేను కల్లో కూడా అనుకోలేదు.

"బేబి, ఏమిటి నీ ప్రాబ్లెమ్?"

నేనేం మాట్లాడలేదు. నిశ్చేష్టురాలినై మమ్మీకేసి చూస్తున్నాను.

"ఆరేడు నెలలుగా చూస్తున్నాను. ఎంత సిల్లీగా ప్రవర్తిస్తున్నావో ఏమన్నా తెలుస్తోందా నీకు?" నే నింక ఏం మాట్లాడలేదు.

"ఎవ రతను?"

"..."

"బేబి!"

"వాను..." నూతిలోంచి వచ్చినట్టుంది మాట. మమ్మీని అంత కోపంగా ఎప్పుడూ చూడలేదు.

"నీ వయ సెంత? నువ్వెంత? ఏం మాయమాటలు చెప్పి నిన్ను వల్లో వేసుకున్నాడు?" నే నింక వినలేకపోయాను.

"మమ్మీ!"

"ఏవిటా అరుపులు!"


"అతన్నేం అనకు. అతనేం నన్ను వల్లో వేసుకోలేదు. నేనే..."ఇంక మాట్లాడలేకపోయాను.

"మై లిటిల్ పూర్ చైల్డ్! ఎంత అమాయకురాలివమ్మా! ఇదంతా ప్రేమనుకుంటున్నావేమో!? పీర్ ఇన్‌ఫాట్యుయేషన్!! నీ పసితనాన్ని అలుసుగా తీసుకొని, నీ సిరిసంపదలకోసం ఎవరైనా తీయగా మాట్లాడితే ఇలా వాళ్ళ బుట్టలో పడిపోవడమేనా? లోకం అంతా నీ ఇల్లులా భద్రంగా ఉంటుందనుకోకు. ఆడపిల్ల వైనందుకు నిన్ను నువ్వు చాలా ప్రమాదాల్లోంచి రక్షించుకోవలసి ఉంటుంది. తోడేళ్ళలా ఎదురుచూస్తూ ఉంటారు. దీనికి తోడు మనమే వల్నరబుల్‌గా ఉంటే ఎలా?

"ఇంకో విషయం. కన్నెపిల్లకి పదహారేళ్ళ వయసు ఎంతో ప్రమాదకరమైనది. నువ్వందరిలాంటి దానివి కాదనీ, నీది మెచ్యూర్డ్ మైండ్ అనీ మురిసిపోతూ ఉండేదాన్ని. చిన్నప్పటినుంచీ నీకు వయసుకి మించిన తెలివితేట లున్నాయని గర్వించాను. అన్ని విషయాల్లోనూ నీ మీద సంపూర్ణ విశ్వాసం ఉండేది. ఇంత స్టుపిడ్‌గా మారతావనుకోలేదు.

"నువ్వింకా చిన్న పిల్లవని మరిచిపోకు. చదువు తప్ప ఇంకో ధ్యాస ఉండకూడని వయసు నీది. నువ్వు చదువుకోవలసింది చాలా ఉంది. నీకు ఉజ్జ్వల భవిష్యత్తు ఉంది. నీ చేత మెడిసిన్ చదివించి, స్టేట్స్‌కి పంపి గొప్ప స్పెషలిస్టని చేద్దామని మీ డాడీ, నేనూ కలలు కంటున్నాం. ఇప్పుడు నువ్విలా స్పాయిల్డ్ చైల్డ్‌గా ప్రవర్తిస్తావా? మా ఆశలు అడియాసలు చేస్తావా? ని న్నతి గారాబంగా పెంచుకుంటున్న మాకు నువ్విచ్చే ప్రతిఫలం ఇదా? నువ్వింకా కళ్ళు తెరవని పసిపాప క్రిందే లెక్క. నేను నీకు తల్లిని. నీ శ్రేయస్సు కంటె మాకు మరేదీ ఎక్కువ కాదు. నువ్వు తప్పు దారిని పోయి, ఇదే నా శ్రేయస్సనే భ్రమలో ఉంటే, సరిదిద్దవలసిన బాధ్యత మా కుంది.

"ఎవరినో చూసి ప్రేమనుకోవడం, ఈ అజ్ఞానం, ఈ ఫేజ్- నీ వయసులో ప్రతి కన్నెకీ వస్తుంది. డాడీకి, నాకు నువ్వంటే చాలా ప్రేమ. అది నీకూ తెలును. నువ్వేదో ఇంట్లో ప్రేమకోసం అలమటించిపోయినట్లు బయట ఎవడో కొంచెం అభిమానంగా మాట్లాడగానే పరవశించిపోయి, నీ స్థానం నువ్వు మరిచిపోతే ఎలా? ఇలాంటి ప్రలోభాలకి లొంగకుండా మనల్ని మనం అదుపులో పెట్టుకొని జీవితాన్ని సక్రమ మార్గంలో నడిపించుకొని ఉన్నత శిఖరాల్ని చేరుకోవడంలోనే విజ్ఞత ఉంది. జీవితాన్ని పాడు చేసుకోవడం చిటికెలో పని. చాలా మందితో పోల్చుకుంటే నువ్వు చాలా మెరుగైన స్థానంలో ఉన్నావు. నీకు చాలా అడ్వాంటేజెస్ ఉన్నాయి. మంచి ఎంకరేజ్‌మెంట్, పుష్ ఇచ్చే తలిదండ్రులం ఉన్నాం. నీకు ఎన్నో అవకాశాలు కలుగజేసే కాంటాక్ట్స్, స్థితిగతులు మనకి ఉన్నాయి. వీ టన్నింటినీ ఉపయోగించుకొని బ్రతుకుని బంగారు బాటగా మలచుకుంటావో, అధోగతికి పోతావో నిశ్చయించుకో. అసలు ఇవన్నీ ఆలోచించావా నువ్వు? నువ్వేదో తెలివైనదానివని అనుకుంటూ ఉండేదాన్ని ఇన్నాళ్ళూ."



నేను తల దించుకొని టేబుల్ మీద గోరుతో గీస్తున్నాను. టీచింగ్ ప్రొఫెషన్‌లో ఉంది కదా వామ్ అప్ అయి విజృంభిస్తోంది.

"మీ పిన్ని నడిగి అతని గురించి తెలుసుకున్నాను. సైనో అట సైనో! వాళ్ళన్నయ్య క్లర్క్- ప్రేమ అనగానే సరిపోయిందా? అసలు ముందు నీ గురించి నువ్వు నిర్ణయించుకునే వయ సే లేదే? నీ ఆశయాలు నెరవేర్చే సామర్థ్యం అతనికి ఉందో, లేదో చూసుకోవద్దూ! మనం ఉన్న వాళ్ళమే కదా. అతన్నే మనం పోషించవ చ్చంటావా? అలా వచ్చి మనతో ఉండిపోయే వాడి మీద, మనమీద ఆధారపడే వాడి మీద నీకు గౌరవం ఎలా ఉంటుంది? మాకెలా ఉంటుంది? పిచ్చి పిచ్చి

ఊహాలు పెట్టుకోక జీవితాన్ని వాస్తవ దృక్పథంతో చూడు. నీ బాగోగులు నీకే తెలుస్తాయి.

"ఇందాకా చెప్పినట్టు ఇలాంటి ఫేజ్ ప్రతి కన్నెకీ ఉంటుంది. ఈ ఇన్ ఫాట్యుయేషన్ నీకు గాఢ ప్రేమలాగే ఉంటుంది. రెండు, మూ డేళ్ళు పోయాక వెనక్కి తిరిగి చూసుకుంటే నువ్వే నవ్వు కుంటావు. 'హౌ సిల్లీ ఐ వాజ్' అని నీకే అనిపిస్తుంది. ఇప్పటి నోమాటల విలువ అప్పుడు నీకు తెలిసి వస్తుంది. ఎనీవే, నీ జీవితం, నీ ఇష్టం. ఆలోచించుకో. తలిదండ్రులం, పెద్దలం, నీకన్నా ఎక్కువ జీవితాన్ని చూసిన వాళ్ళం, కాస్తో కూస్తో చదువుకొని విజ్ఞానం సంపాదించుకు న్నా మనుకుంటున్న వాళ్ళం...మా గైడెన్సుని ఒప్పు కుంటావో, క్షణికావేశంలో నీ జీవిత కుసుమాన్ని నేల రాసేసుకుంటావో నువ్వే నిర్ణయించుకో!" గడియ తీసుకొని బయటకు వెళ్ళిపోయింది.

**　　**　　**

నేను నా గదిలోకి వెళ్ళిపోయి తలుపులు బిడా యించుకున్నాను. దుఃఖం ముంచుకు వచ్చింది. నా కన్నీటితో తలగడ అంతా తడిసిపోయింది. ఏడ్చి ఏడ్చి మొహం అంతా ఉబ్బింది. ఆ రోజంతా నేను భోజనానికి వెళ్ళలేదు. డాడీ ఒక సారి వచ్చి తలుపు తట్టారు. కానీ, మమ్మీ పిలవ డంతో వెళ్ళిపోయారు. ఆ తరవాత మమ్మీ చాలా సేపు మాట్లాడడం వినిపించింది. డాడీకి మొత్తం జరిగినదంతా చెపుతోంది కాబోలు.

రాత్రంతా గాఢంగా ఆలోచించాను. కాని, ఎటూ నిశ్చయించుకోలేక పోయాను. ఏ నిర్ణయం తీసుకో వడానికైనా ముందు అతనితో మాట్లాడాలి. అతని అభిప్రాయమేమిటో ముందు తెలుసుకోవాలి. అత న్నే ముందు స్టెప్ తీసుకోనీ అనుకోడానికి ఇప్పు డు టైమూ లేదు. ఇవి పాత రోజులు కావు.

మర్నాడు కాలేజీ మానేసి అతని ఇంటికి వెళ్ళాను. అతను ఏమంటాడో అన్న టెన్షన్ నాలో బాగా పేరుకుపోయింది.

వాను ఆ ఉదయమే కలకత్తా వెళ్ళిపోయాడట!

నాకు గాలి తీసేసినట్లయింది. నిన్నటి సాయంత్రమే అతణ్ణి కలుసుకోనందుకు నన్ను నేను తిట్టుకున్నాను. వెంటనే వివరంగా అతనికి ఉత్తరం వ్రాద్దామనుకున్నాను. కాని, ఇలాంటి విషయాలు ముఖాముఖి మాట్లాడుకోవడమే మంచిది. ఇలా ఎందుకయిందో చూద్దాం. అదీకాక ఫైనల్ ఎగ్జామ్స్ దగ్గర పడిపోయాయి. లైఫ్‌లో ఇదీ టర్నింగ్ పాయింటేకదా! కొంతకాలం వేచి చూద్దాం అనిపించింది.

ఇంట్లో మళ్ళీ ప్రశాంత వాతావరణం నెలకొంది. అంతా మామూలుగానే ఉంటున్నాం. వాను దగ్గర నుంచి జాబు లేదు. నేనూ వ్రాయలేదు. నా కోపం అంతా చదువుమీద చూపించాను. కాలేజి, లైబ్రరీ, ఇల్లు-అంతే. పరీక్షలు అయ్యాయి. డిస్టింక్షన్‌లో పాసయ్యాను.

**　　**　　**

వాను ఇంట్లోకి కొత్త వాళ్ళెవరో వచ్చారు. వాను అన్నయ్య విజయనగర్ కాలనీకి మారిపోయారట. ఇన్నాళ్ళ తరవాత వాను మళ్ళీ బాగా జ్ఞాపకానికి వస్తున్నాడు. అతనికి నా మీద ఇంటరెస్టు లేదని తెలిసిపోయింది. గుండె అంతా శూన్యం అయి పోయింది. నాది 'ఒన్‌వే ట్రాఫిక్' అన్న మాట. సాధారణంగా అబ్బాయిలు ప్రేమలో పడటం, ఆడవాళ్ళు తిరస్కరించడం, వీళ్ళ కోసం వాళ్ళు నానా పాట్లు పడడం చూస్తూ ఉంటాం, చదువు తూ ఉంటాం. నాది రివర్స్ కేసు! అయినా, అతను నన్ను ప్రేమించినట్టు ఏ నాడూ సూచించ లేదు. నేనే అతని వెనకపడ్డాను. నేనే అతని పట్ల ఆకర్షితురాలినయ్యాను. అతణ్ణి చూసిన మొదటి క్షణాన్నే అతనికి వశం అయిపోయాను. అతను నాకు జన్మ జన్మల నుంచీ తెలుసనిపించింది.

అతనితో గడిపిన క్షణాలు ఎంత మధురంగా ఉన్నాయి! పోనీ, వాటినే కలకాలం తలుచు కుంటూ ఆనందిస్తాను! ఈ ఆనందాన్ని నా నుంచి ఎవరూ వేరు చేయలేరు.

××　　××　　××

ఒకసారి నేను బస్సులో వెళ్ళుతూంటే, ఫుట్ పాత్ మీద నడుచుకుంటూ వెళ్ళిపోతూ కనిపించా డు. అతణ్ణి చూడగానే గుండె ఒకసారి ఆగి మళ్ళీ కొట్టుకుంది. మొదటిసారి ఏణ్ణర్ధం క్రితం అతణ్ణి చూసినప్పుడు ఎలా స్పందించానో ఇప్పుడూ అలాగే స్పందించాను. మునుపటికన్నా కొంచెం సన్నబడ్డాడు. వాడని చిరునవ్వు. అతనిది డెఫినెట్‌గా మాగ్నటిక్ పెర్సనాలిటీ. అతనిలో ఏదో తెలియని 'చరిస్మా' ఉంది. పది మందిలోనూ ఠక్కున ఆకట్టుకునే లక్షణం అతనిలో ఉంది. పిలుద్దామనుకున్నాను. కానీ, అప్పటికే పిలుపుకి అందనంత దూరం వెళ్ళిపోయాడు. ఇంతలో బస్సు కదిలిపోయింది.

××　　××　　××

అనంత కోటి జీవరాసుల జనన మరణాలతో, సుఖదుఃఖాలతో తనకు ప్రమేయం లేదన్నట్టు కాలచక్రం దొర్లిపోతోంది. ఒక రోజు ఫ్రెండ్స్‌తో కలిసి సినిమాకి వెళ్ళాను. అక్కడ కనిపించా డు. మా వాళ్ళని వదిలి అతని పక్క సీటులో కూచున్నాను. ఫీచర్స్ ఇంకా షార్ప్‌గా తయారయా యి. ఎందుకు ఇతన్ని చూస్తుంటే ఇంత అనిర్వచ నీయమైన ఆనందం కలుగుతుంది? నా ఆత్మ ఇతనితో ఎంత పెనవేసుకు పోయింది! మనిషిలో మంచి తేజస్సు ఉంది. ఈ తేజస్సే నన్నతనికి దాసురాలిని చేసింది. అతని కేసి తన్మయ త్వంగా చూస్తున్నాను. ఇటు తిరిగాడు.

"హలో! వాటె ప్లెజంట్ సర్‌ప్రైజ్!" నవ్వుతూ అన్నాడు.

"హాయ్!"

"ఎలా ఉన్నారు? ఏమిటి? చాలా రోజుల యిందే మిమ్మల్ని చూసి." నన్ను పరిశీలించా డు. "బాగా పొడవయ్యారే!" నవ్వుతున్నాడు. మొ దటి పరిచయంలో మామాటలు గుర్తుకి వచ్చినట్టు న్నాయి.

"బాగున్నాను. మీ రెలా ఉన్నారు?" నా మన సంతా ప్రఫుల్లమై పోతోంది.


"ఏం చదువుతున్నారు?"

"మెడిసిన్ థర్డ్ ఇయర్."

"వెరీగుడ్. కీపిటప్!"

చాలా సేపు పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకున్నాం. ఇతని పక్కన కూర్చుంటే ఎంత థ్రిల్లింగ్‌గా ఉంది! సినిమామొదలయింది. 'అర్ధసత్య'. నేను పిక్చర్ చూడ్డంలేదు. అతన్నే చూస్తున్నాను. అలా అతని మీద వాలిపోదా మనిపించింది. ఇన్నాళ్ళూ ఇతన్ని చూడకుండా ఎలా ఉండగలిగాను? ఆశ్చ ర్యంగా ఉంది. ఇన్నాళ్ళు నే నణచి పెట్టిన ప్రేమ, నాలో జాగృతమైన ప్రేమ కట్టలు తెంచుకుని బయటికి వచ్చింది. అతని ఎర్రని పెదాల్ని ముద్దు పెట్టుకోవాలనిపించింది. 'ఐ లవ్ యు, వానూ. ప్లీజ్ టేక్ మి ఎవే!' అనాలనిపించింది. నా ఆలోచనలని అతను చదవగలిగితే ఎంత బాగుండును! ఆ సమయంలో అతను 'కమాన్, హేమా' అంటే అతనితో ఎక్కడికైనా సరే వెళ్ళి పోయి ఉందును. నాకు తెలియకుండానే నా చేయి అతని చేతిలో పడింది. అతను మెల్లిగా నా చేయి నొక్కి వదిలేశాడు.

ఇంతలో నాకు దుఃఖం ముంచుకు వచ్చింది. నే నంటే అతనికి ప్రేమ లేదని నిర్ధారణ అయిపో యింది. ఏదో స్నేహితురాలిగా చూస్తున్నాడే తప్ప మరే వికారాన్ని ప్రదర్శించడం లేదు. శ్రద్ధగా సినిమా చూస్తున్నాడు. ఇంకెవరినైనా ప్రేమించా డేమో! ఆ ఊహ రాగానే నా ఒళ్ళంతా కంపర మెత్తింది. కోపంగా అతని కళ్ళలోకి చూశాను. ఎంత నిర్మలంగా, ప్రశాంతంగా ఉన్నాడు! నా లోని అగ్ని పర్వతాల అలజడి అతని కేమాత్రం తెలియడం లేదు.



అతను అంత సచ్ఛీలుడా? శ్రీరామచంద్రుడా? ఒక్కసారి నన్ను కరుణి స్తే ఎంత బాగుంటుంది! ఆడదానికి ఇలాంటి ఊహలు రాకూడదేమో! ఆడ జన్మ ఎంత దురదృష్టకరం! పంటితో పెదవిని కొరుక్కున్నాను. ఇంకా అక్కడే కూర్చుంటే భోరున ఏడ్చే సేలా ఉన్నాను. నా సీట్‌లోకి వెళ్ళిపోయాను. కాని, అతని సంస్కారానికి మరీ ముగ్ధురాల్నై పోయాను.

"ఎవరే అతను?"

"నా కజిన్."

తలనొప్పి మొదలయింది. వెళ్ళిపోదా మనుకున్నాను. కాని, కనీసం ఆ కొంచెం సేపైనా అతణ్ణి చూసుకో వచ్చు కదా! ప్రేమ సౌభాగ్యం నా మనసు కెలాగూ లేదు. దర్శన భాగ్యానికైనా నా కళ్ళను నోచుకోనీ. ఇంటర్వెల్‌లో నేను నా స్నేహితురళ్ళతో ఉండడం చూసి, నే నతని కేసి వెళ్ళే లోపలే అటునుంచి బయటకు వెళ్ళిపోయాడు. సినిమా పూర్తి అయ్యాక చూ స్తే కనపడ లేదు.

× × × × × ×

మెడిసిన్ ఫైనల్ ఇయర్‌లోకి వచ్చాను. ఒక సాయంకాలం లకుమ ఇంటికి వెళ్ళుతూంటే నందు మొదల్లో కనిపించాడు.

"హలో!"

"హాయ్!" ఎంత కాలం తరవాత చూసినా, ఎప్పుడు చూసినా నాలో అదే స్పందన. నా ఎద వీణమీద అదే మీటు.

"ఏంటీ ఇక్కడ నుంచున్నారు?"

"మా వదిన లకుమ గారింటికి వెళ్ళింది."!

లకుమకి, ప్రసాద్‌కి ఈమధ్య బెడిసికొట్టింది. విడిపోయారు. మగవాడు లేని ఇంట్లోకి వెళ్ళడం ఎందుకులే అని అక్కడే ఆగిపోయినట్లున్నాడు. ఎంత రాచఠీవి!

"హేమా!"

"ఊఁ..."

"రేపు 23 న నా పెళ్ళి. తప్పకుండా రావాలి." చేతికి వెడ్డింగ్ కార్డు ఇచ్చాడు.

నా తలమీద పిడుగు పడినట్లయింది. కాళ్ళకింద నుంచి భూమి వగిలినట్లయింది. నా మొహం వివర్ణం అవడం నా కే తెలిసింది. అత నేం తెలివిహీనుడు కాడు. నాలో మార్పు చూస్తున్నాడు. గిల్టీగా తల దించుకున్నాడు.

"హేమా!"

"ఊఁ..."

అతను మంద్ర స్వరంతో గంభీరంగా అంటున్నాడు.అప్పటి అతని మాటలు జీవితాంతం నా చెవుల్లో గింగురు మన్నాయి.

"హేమా! మొదటినుంచీ మీరు నా వట్ల చూపుతున్న అభిమానాన్ని గ్రహించాను. కానీ, మనిద్దరి సోషియల్ లెవెల్స్ వేరు. మీకు నేను న్యాయం చేకూర్చలేనని నాకు తెలుసు. మన కలయిక మీ అమ్మగారికి ఇష్టం లేదనీ నాకు తెలుసు. మీ పేరెంట్స్‌కి మీ మీద ఎన్నో ఆశలు ఉంటాయి. వారి స్థానంలో ఉండి అవి నే నూహించుకోగలను. అవి నా మూలంగా విచ్ఛిన్నం కావడం నా కిష్టం లేదు.

"నేను చాలా ఆలోచించి ఎప్పుడో ఈ నిర్ణయానికి వచ్చాను. నేను మీకు తగను. మన కోరికల కంటే మనకి జన్మ నిచ్చిన తలిదండ్రుల అభీష్టాలకే ఎక్కువ విలువ నివ్వాలి. మన బాగోగులు మన కంటే వాళ్ళకే బాగా తెలుస్తాయి. నా తలిదండ్రుల్ని నా చిన్నతనంలోనే కోల్పోయాను. వాళ్ళు నా గురించి ఏం కలలు కన్నారో నాకు తెలియదు. కానీ, వాటిని సాధించలేనంత పెద్ద సంసారం మాది. మీరా శ్రీమంతులకి ఏకైక సంతానం. మిమ్మల్ని మీ వాళ్ళ కిష్టం లేకుండా చేపట్టి, వాళ్ళకి దూరం చేసి వాళ్ళ ఉసురు పోసుకోలేను. నన్ను మీరు అసమర్థుణ్ణనుకున్నా ఫరవాలేదు. నన్ను ప్రేమించినందువల్ల సమాజం ఒక గొప్ప డాక్టర్‌ని కోల్పోకూడదు." అతని కంఠం డగ్గుత్తిక పడింది.

నా కంటినుండి నీరు ధారగా కారుతోంది.

"హేమా! ఎనీవే ఐ యామ్ గ్రేట్‌ఫుల్ ఫర్ యువర్ ఫ్రెండ్‌షిప్, ఫర్ ది ఆనర్ యూ హేవ్ డన్ మి. ఐ విల్ రిమెంబర్ యు ఫర్ ఎవర్. గుడ్‌లక్ అండ్ గుడ్ బై." ఎంతో ప్రయత్నంమీద దుఃఖాన్ని ఆపుకొని చెప్పిన అతని మాటల్లో అతని నిజాయితీ అంతా ప్రతిధ్వనించింది. నా కంట్లోని నీటిబిందువుల గుండా వెళ్ళిపోతున్న అతని రూపం చెదిరిపోతోంది. ఇంటికి ఎలా చేరానో తెలియదు. తలుపులు దడేల్న మూసి బెడ్ మీద వాలిపోయాను.

నాలో అగ్ని పర్వతాలు పేలుతున్నాయి. తలలో సమ్మెట పోట్లు. నా హృదయం తూట్లు పడిపోయింది. ఏ దుష్టశక్తో మమ్మల్ని కలవనీయకుండా చేసింది. అతడు సంపూర్ణంగా పరాధీనుడై పోయాడన్న విషయానికి తట్టుకోలేక పోయాను.

మమ్మీ! ఇది 'పియర్ ఇన్‌ఫాట్యుయేషన్' అన్నావు. కాదు, మమ్మీ, నాది నిజమైన, గాఢమైన ప్రేమ. ట్రూ లవ్! వెనక్కి తిరిగి చూసుకుని నవ్వుకుంటావన్నావు. లేదు, మమ్మీ, నవ్వుకోవడం లేదు. ఏడుస్తున్నాను. గుండె పగిలేలా ఏడుస్తున్నాను.

మీరు కోరినట్లే నేను డాక్టర్ని అవ్వచ్చుగాక. స్టేట్స్‌కి వెళ్ళి గొప్ప స్పెషలిస్ట్‌ని అవ్వచ్చుగాక. రెండు చేతుల్తో డబ్బునీ, కీర్తినీ సంపాదించవచ్చుగాక. కానీ, ఇవేవీ నాకు సంతోషాన్ని కలిగించలేవు, మమ్మీ! వీటన్నిటికంటే అతని సాన్నిధ్యమే ఎక్కువ నాకని ఎవరూ తెలుసుకోలేక పోయారు. నన్ను అర్థం చేసుకోలేకపోయారు.

వానూ! నే నంటే నీకు ప్రేమ లేదనుకున్నానే తప్ప, నా తలిదండ్రులకు ఇష్టం లేదన్న ఒక్క కారణం చేత నువ్వు విముఖుడ వయ్యావని నాకు ఒక్క సూచన ఇచ్చి ఉంటే ఎంత బాగుండేది! ఇప్పుడు నిన్ను పోగొట్టుకునే వరకూ ఈ ఘాతం ఇంత తీవ్రంగా ఉంటుందని నాకు తెలియలేదు. వానూ! ఎంత ఆలస్యం అయిపోయింది! ట్రూ, లవ్ నెవర్ రన్స్ స్మూత్!

రేపు ఎవరికో నన్నిచ్చి కట్టపెడతారు. ఇష్టం లేకపోయినా ఆత్మవంచన చేసుకుంటూ అతనితో కాపరం చేయాలి. అలా అవడానికి వీల్లేదు. జీవితాంతం కన్యగా ఉండిపోతాను. మరు జన్మ అంటూ ఉంటే నిన్నే తప్పక పొందుతాను.

పెద్దవాళ్ళు, విజ్ఞులు, సమాజం, అంతస్తులు, భేదాలు...హుఁ? ఎందుకు వీళ్ళంతా? ఒక ఆడదాని మనసుని అర్థం చేసుకోలేరు. కన్నకూతురి సుఖమేదో తెలుసుకోలేరు. ప్రియురాలి ఆరాధనని అందుకోలేరు!

అంతకంతకు నాలో కసి రేగిపోయింది. డ్రెస్సింగ్ టేబుల్ అద్దం పగలగొట్టాను. బుక్ షెల్ఫ్ తోసేశాను. పుస్తకాలన్నీ చిందర వందర చేశాను. ఫ్లవర్ వేజ్‌లు గోడలకేసి కొట్టాను. చేతి కందిన వన్నీ విసిరేశాను. స్కాల్పెల్ తీసి పరుపు తలగడాలు కోసేశాను.

తలుపు దబ దబ బాదిన చప్పుడు.

"బేబీ! బేబీ!" మమ్మీ!

"ప్లీజ్ గో ఎవే. ఆల్ ఆఫ్ యూ గో ఎవే! లీవ్ మీ ఎలోన్."

ఏడుపుతో, కోపంతో, ఉక్రోషంతో నా అరుపు నాకే వింతగా అనిపించింది.

(సమాప్తం)

